www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 డిసెంబర్ 2022



6న జిల్లాకు ముఖ్యమంత్రి రాక : కలెక్టర్

కడప : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 6న జిల్లాలో పర్యటించే అవకాశముందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శనివారం స్పందన హాలులో సిఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జెసి సాయికాంత్‌వర్మ, కమిషనర్ ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డిఆర్‌ఒ, గంగాధర్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించామని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

లంపీ స్కిన్ జోరు!



జిల్లా వ్యాప్తంగా 655 కేసులు నమోదు

జమ్మలమడుగు డివిజన్‌లో 322 గుర్తింపు

మైదుకూరులో అత్యధికంగా 72 కేసులు

26,925 పశువులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పశుసంపదను లంపీస్కిన్ వైరస్ వణికిస్తోంది. రెండు నెలలుగా దేశంలోని పశువులపాలిట మహమ్మారిలా మారిన సంగతి తెలిసిందే. జిల్లాలోని పశుసంవర్ధకశాఖ పరిధిలోని కడప, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్లలో అత్యధికంగా జమ్మలమడుగు డివిజన్ అత్యధిక కేసులు నమోదయ్యాయి. మైదుకూరు, చాపాడు మండలాల్లో అధికంగా కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈలెక్కన జిల్లా వ్యాప్తంగా 655 లంపీస్కిన్ కేసుల్లో 29 పశువులు మృతి చెందినట్లు జిల్లా పశువైద్య శాఖ నిర్ధారించింది. ప్రభుత్వం వైరస్ వ్యాప్తి నిరో ధానికి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేసినప్పటికీ వైరస్ వ్యాప్తి కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా పశుగణన లెక్కల ప్రకారం 43,409 పశువులున్నాయి. ప్రస్తుతం 34,728 పశుసంపద ఉంది. జిల్లాలోని కడప, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్ల పరిధిలోని పశువులకు లంపీస్కిన్ వైరస్ విజృంభించింది. ఇందులో జమ్మలమడుగు డివిజన్‌లో అత్యధికంగా 322 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించింది.

మైదుకూరులో అత్యధిక కేసులు

జిలా అత్యధికంగా మైదుకూరు మండల పరిధిలో 72 కేసులు, చాపాడులో 45 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించింది. కడప డివిజన్ పరిధిలో 245 కేసులు, పులివెందుల డివిజన్ పరిధిలో 85 కేసుల చొప్పున నమోదయ్యాయి. లింగాల మండలంలోని 36 కేసులు, సింహాద్రిపురం మండలంలో 30 కేసుల చొప్పున నమోదు కావడం గమనార్హం.

జిల్లా వ్యాప్తంగా 29 పశువులు మృతి

జిల్లాలోని కడప, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్ల పరిధిలో బద్వేల్‌లో ఒకటి, బి.కోడూరులో మూడు, పోరుమామిళ్లలో ఒకటి, కలసపాడులో ఒకటి, లింగాలలో ఒకటి, సింహాద్రిపురంలో రెండు, జమ్మలమడుగులో ఒకటి, మైలవరంలో ఒకటి, దువ్వూరు ఐదు, పెద్దముడియం నాలుగు, రాజుపాలెం రెండు, చాపాడు ఒకటి, మైదుకూరులో మూడు, యర్రగుంట్లలో రెండు చొప్పున మృతి చెందడం ఆందోళన కలిగించింది.

వ్యాక్సినేషన్ షురూ

జిల్లా పశుసంవర్ధకశాఖ లంపీస్కిన్ నివారణకు వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేసింది. జిల్లాలోని 34,728 పశువుల్లో 26,925 పశువులకు వ్యాక్సినేషన్ వేసినట్లు తెలుపుతోంది. ఈలెక్కన 4,803 పశువులకు వ్యాక్సినేషన్ వేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 36 మండలాల్లో 10 మండలాల్లో వ్యాక్సినేషన్ వేసినట్లు తెలుస్తోంది. చింతకొమ్మదిన్నె, కడప, పెండ్లిమర్రి, కమలాపురం, వల్లూరు, ఖాజీపేట, పోరుమామిళ్ల, కాశినాయన, అట్లూరు, యర్రగుంట్ల మండలాల్లో వ్యాక్సినేషన్ పూర్తి చేసింది. మిగిలిన 26 మండలాల్లో కొనసాగుతున్న వ్యాక్సినేషన్ ఎప్పటికి ముగుస్తుందో వేచి చూడాల్సి ఉంది.

ఆందోళన అవసరం లేదు

జిల్లాలో లంపీస్కిన్ వైరస్ అదుపులోనే ఉంది. ఆందోళన పడాల్సిన అవసరం లేదు. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేశాం. అతి త్వరలోనే అదుపులోకి రానుందని పేర్కొనడం గమనార్హం.

- సి.శారదమ్మ, జిల్లా పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారి. కడప.

ముగిసిన సిఎం జిల్లా పర్యటన



కడప విమానాశ్రయంలో సిఎంకు వీడ్కోలు పలుకుతున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లా రెండు రోజుల పర్యటన శనివారంతో ముగిసింది. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం లింగాల మండలం పార్నపల్లె సమీపంలోని చిత్రావతి నిజమైన పర్యాటక కేంద్రంగా రూపొందించడానికి పలు కార్యక్రమాలు ప్రారంభించారు. రెండో రోజు శనివారం ఉదయం 9.30 గంటలకు తన వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్ కుమార్తె వివాహానికి సిఎం జగన్, ఆయన సతీమణి భారతి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఉదయం 10 గంటలకు హెలికాప్టర్ ద్వారా కడప విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. కడపలో సిఎం జగన్‌కు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పి అన్బురాజన్, నగర మేయర్ కె.సురేష్ బాబు, ఎంపీ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రాయలసీమ డిఐజి సెంథిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, కడప ఆర్డీఓ ధర్మ చంద్రారెడ్డి, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, కడప డిఎస్పీ శివారెడ్డి, ఎయిర్ పోర్ట్ అధికారి శ్రీనివాస్ వీడ్కోలు పలికారు.

ముఖ్యమంత్రి జగన్ ఔదార్యం

రైతు, ఇద్దరు చిన్నారుల చికిత్సకు ఆర్థిక సాయం



సిఎంకు సమస్యను వివరిస్తున్న శివకుమార్

పులివెందుల టౌన్ : వివిధ వ్యాధులతో బాధపడుతున్న అనంతపురానికి చెందిన ఓ రైతు, పులివెందులకు చెందిన ఇద్దరు చిన్న పిల్లల మెరుగైన వైద్య కోసం రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లా, నార్పల మండలం, గూగుడు గ్రామానికి చెందిన జగన్మోహన్‌రెడ్డి అనే రైతు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నట్లు భార్య శివజ్యోతి తమ ముగ్గురు పిల్లలతో సౌమ్య, హరిప్రియ, యామినిలతో కలసి శనివారం పులివెందుల హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలసి అర్జీ సమ ర్పించారు. నవంబర్ 12 నుండి ఆస్టర్ సిఎంఇ బెంగళూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నా భర్తకు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారని, మీరే ఆదుకోవాలని ముఖ్యమంత్రికి విన్న వించింది. అనంతరం ముఖ్యమంత్రి తక్షణమే రూ.2 లక్షలు మీ అకౌంట్‌లోకి వేస్తామని, పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరించి చికిత్స అందిస్తామని భరోసా కల్పించారు.

పులివెందులలో నివసిస్తున్న కె,శివకుమార్ టైలరింగ్ చేసుకుంటూ భార్య జి.వరలక్ష్మి గృహిణిగా ఇద్దరు పిల్లలు 8 ఏళ్ల హైందవ్, 5 ఏళ్ల కుషల్‌లతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇద్దరు పిల్లలు తీవ్రమైన అనిమియా వ్యాధితో బాధ పడుతున్నట్లు వారికి రక్తం పెరుగుదలకు ఇంజక్షన్ వాడుతు న్నామన్నారు. చెన్నై, బెంగళూరు వంటి మహా నగరాలకు తిరిగినామన్నారు. ఈ వ్యాధి ఆరోగ్యశ్రీ కిందకు రాదన్నారని ప్రస్తుతం హైద రాబాద్‌లోని అమెరికన్ అంకాలజిస్ట్ దగ్గర చికిత్స చేయిస్తున్నామని ఇప్పటికి రూ.15 లక్షలు ఖర్చు అయిందని సిఎంకు అర్జీ సమర్పించారు. మెరుగైన చికిత్స అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ

ఉపాధ్యాయుల సహనానికి పరీక్ష : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఎ-2 పరీక్షలు విద్యార్థుల కోసం కాక ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించేలా ఉన్నాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం. మహేష్ బాబు విమర్శించారు. శనివారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఎ-1 పరీక్షలను ఐఎఎస్ స్థాయిలో ఒఎంఆర్ షీట్లను ప్రవేశపెట్టి నిర్వహించిందని, ఎఫ్ఎ-2 పరీక్షల విషయానికి వచ్చేసరికి చేతులెత్తేసి ప్రశ్నాపత్రాలను గంట ముందు వాట్సప్‌లో పంపించి వాటిని బోర్డుపై రాసి విద్యార్థులు పరీక్షలు రాసేలాగా సూచనలు ఇచ్చిందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలోని ఒకటి రెండు తరగతులు చదివే చిన్న పిల్లలు బోర్డుపై రాసిన ప్రశ్న పత్రాన్ని ఏవిధంగా రాసుకుంటారని ప్రశ్నించారు. అలాంటి చోట విద్యార్థులందరికీ పరీక్ష పేపర్లు ఉపాధ్యాయులే రాసి ఇవ్వాలంటే ఎంత సమయం పడుతుందో ఆలోచించకుండా ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. ప్రశ్నాపత్రాలను ప్రింట్ చేసి పాఠశాలలకు పంపకుండా వాట్సఅప్‌లో పంపడం వల్ల చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. ప్రశ్నాపత్రాలలో బొమ్మలను ఇచ్చి వాటికి వివరణ రాయవలసిందిగా ఇంగ్లీష్, హిందీ, సైన్స్ ప్రశ్నాపత్రాల్లో వచ్చాయని పేర్కొన్నారు. మరి ఆ బొమ్మలను ఉపాధ్యాయుడు బోర్డుపై వేసినా విద్యార్థులు ఏ విధంగా జవాబు పత్రాల్లో వేస్తారో ప్రభుత్వమే చెప్పాలన్నారు. విద్యాశాఖ అధికారుల వింత పోకడల వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుందని తెలిపారు. ఉపాధ్యాయులపై కక్షపూరితంగా ఇలాంటి మతిభ్రమించిన విధానాలను ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులపై ఇలాంటి కుట్రపూరిత విధానాలను ప్రభుత్వం మానుకోవాలని, ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వంలో భాగమే అనే విషయాన్ని ఆలోచించి సరైన విధానాలను అవలంబించి విద్యార్థులకు మంచి విద్యను అందించే విధంగా ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నగర కార్యదర్శి కరిముల్లా, నాయకులు బాబు పాల్గొన్నారు.



విద్యార్థులతో మేనేజింగ్ డైరెక్టర్, కళాశాల సిబ్బంది

చిరస్మరణీయమైన రోజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఫ్రెషర్స్‌డే విద్యార్థుల జీవితాల్లో చిరస్మరణీయమైన రోజు అని కెఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి పేర్కొన్నారు. నగర శివారులోని కెఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల కల్చరల్ కమిటీ విభాగం ఆధ్వర్యంలో బిటెక్ విద్యార్థులకు ఆరాబ్ద్ -2022 ఫ్రెషర్స్‌డేని కళాశాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులను, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు దశాబ్దాల కాలం పైచిలుకు ఎందరో ఇంజినీర్లను తీర్చిదిద్ది నీడనిచ్చిన మహా వృక్షం కేఎస్‌ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల అన్నారు. కళాశాల వనరులను ఉపయోగించుకుని అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఇటు తల్లిదండ్రుల ఆశయాలను, అటు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉన్నత రంగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పాటలు, చిన్నచిన్న స్కిట్‌లతో విద్యార్థులు ఎంతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి, వివిధ విభాగాల అధిపతులు, డీన్లు, స్టూడెంట్స్ అకాడమిక్ డీన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆదినారాయణ రెడ్డి, కల్చరల్ కమిటీ సమన్వయకర్త వీరశంకర్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

5 నుంచి ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు అవసరమైన పరికరాలను అందించడానికి ఈనెల 5 నుంచి ఉచిత వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించ నున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష పథకాధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 5న కడప కేంద్రంలోనూ, 6న బద్వేలు, 7న పులివెందుల, 8న ప్రొద్దుటూరులలో వైకల్య నిర్ధారణ పరీక్షలు ఉంటాయని తెలిపారు. సమీప మండలాల 18 సంవత్సరాలలోపు విద్యార్థులు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ క్యాంపులు నైపుణ్యమున్న వైద్యులచే నిర్వహిస్తామన్నారు.

త్వరలో పెండింగ్ పరిహారం చెల్లిస్తాం : అంబటి

ప్రజాశక్తి-కొండాపురం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

గండికోట ముంపు వాసులకు పెండింగ్‌లో ఉన్న పునరావాస ప్యాకేజీని సిఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పులివెందులలోని ఓ వివా హానికి హాజరైన ఆయన కొండాపురంలో గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నీరు సముద్రంలోకి వృథాగా వెళ్లకుండా బంధించి ప్రజలకు ఉప యోగపడేలా కీ.శే. రాజశేఖర్‌రెడ్డి ప్రాజెక్టులు ప్రారంభించారని, వాటిని పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. ఆశయ సాధకుడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం గండికోట ప్రాజెక్టులో ముంపును గురైన ప్రజలు అఖిలపక్షం ఆధ్వ ర్యంలో మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో హస్తకళలు బడిగింజల విజయలక్ష్మి, ఎస్ఇలు శ్రావణ్‌కుమార్‌రెడ్డి మల్లికార్జున రెడ్డి, చెంగయ్య కుమార్, శ్రీనివాసులు, ఇఇ వెంకటరామయ్య, జికెఎల్ఐఎస్ ఇఇ, ఇఇ బాలాజీ రావు, తహశీల్దార్ శోభన్‌బాబు, సిఐ సుందర్శన్ ప్రసాద్, ఎస్ఐలు సత్యనా రాయణ, రవికుమార్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు

డిగ్రీ 2, 4 సెమిస్టర్ల ఫలితాల విడుదల

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం డిగ్రీ రెండవ, నాలగవ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను యోగి వేమన విశ్వవిద్యాలయం వి సి ఆచార్య మునగల సూర్యకళావతి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఉత్తమ ఫలితాలను సొంతం చేసుకున్న విద్యార్థులను , కళాశాలల యాజమాన్యాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వి సి మాట్లాడుతూ ప్రతి కోర్సులోనూ బాలికలు ఉత్తమ ఫలితాలతో ముందువరుసలో నిలిచారని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రెండు, నాలుగు సెమిస్టర్ల పరీక్షలు చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం విధానంలో నిర్వహించామని వివరించారు. రెండవ సెమిస్టర్‌లో 44.24 ఉత్తీర్ణత శాతం నాల్గవ సెమిస్టర్‌లో 43.29శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు.

విద్యార్థులకు రక్త గ్రూపు పరీక్షలు

కడప అర్బన్ : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు రక్త గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు ముందుగా తమ బ్లడ్ గ్రూప్ తెలుసు కోవడం వల్ల భవిష్యత్తులో ఎవరికైనా రక్తం అవసరం వచ్చినా ఇవ్వడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. రక్త దానం అన్ని దానాల కన్నా గొప్పదని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ రక్తం గ్రూపు తెలుసుకుని ఉండాలి అని వివరించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, డాక్టర్.పి.శచీ దేవి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సీనియర్ లాబ్ టెక్నీషియన్ స్వరూపరాణి యితర సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమార్జనే ధ్యేయంగా పాలన

ప్రజాశక్తి - కడప అర్బన్

జగన్మోహన్ రెడ్డి పాలనలో ఆహార ధాన్యాలు, నిత్యావసర వస్తువులు ధరలు పేదలకు భారంగా మారాయని, అక్రమార్చిన ధ్యేయంగా ప్రతి వస్తువుపైనా ధరలు పెంచి పరిపాలన సాగిస్తున్నారని కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు విమర్శించారు. శనివారం 15వ డివిజన్ శివానందపురంలో డివిజన్ ఇన్‌ఛార్జి కొండా సుబ్బయ్య ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి, అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పర్యవేక్షణలో ఇదేం కర్మ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివకొండ రెడ్డి, ఉపాధ్యక్షుడు నాదెల దస్తగిరి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దూదే కుల నజీర్, నాయకులు కొమ్మల పాటి సుబ్బరాయుడు, గన్నెపాటి మల్లేష్, రాయుడు, జల తోటి జయకుమార్, మహిళ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురికినాటి సునీత, పార్వతి, జనార్దన్ రెడ్డి, 1వ డివిజన్ ఆంజనేయులు, కిరణ్ కుమార్ యాదవ్, యువ నాయకుడు కొండా రాజా, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు. **చెన్నూరు :** స్థానిక 1, 13వ వార్డుల్లో శనివారం 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం' నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరింఆరు. టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, షబ్బీర్ హుస్సేన్, రాంబాబు, సుదర్శన్, బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్‌పిటిసి చిన్నయ్య, పోస్టల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గర్జన ఎవరి కోసం? : టిడిపి

కడప అర్బన్ : కర్నూలు న్యాయ రాజధాని కోసం వైసిపి నాయకులు జెఎసి పేరుతో నిర్వహించే గర్జన ఎవరి కోసమని టిడిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ గోపాల్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ రాజధానికి ఎవరు అడ్డుపడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేందుకే అధికార వైసిపి ఇలాంటి కార్యక్రమాలను చేపడుతుందని విమర్శించారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, మీడియా కో-ఆర్డినేటర్ జనార్ధన్, పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిఘా పెట్టాలి : సిపిఎం

పోరుమామిళ్ల టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన రాజకీయాలపై ఎన్నికల కమిషన్ నిఘా పెట్టాలి అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక సమావేశం మండల కార్యదర్శి ఎన్. భైరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ఓట్ల అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే పద్ధతి ప్రధాన పాలక, ప్రతిపక్ష అభ్యర్థుల తరపున వారి అనుచర నాయకులు చేపట్టారని చెప్పారు. దీని వల్ల అనర్హుల ఓట్లను ఓటర్ లిస్టులోకి తప్పుడు పద్ధతుల్లో ఎక్కిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఓట్లు నేడు వేలల్లోకి చేరాయని సమాచారం వస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా పెట్టి అక్రమ ఓట్ల నమోదు చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనర్హుల పేర్లను ఎమ్మెల్సీ ఓటర్ల లిస్టు నుంచి తొలగించాలని, వెరిఫికేషన్ వేగంగా చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చెన్నయ్య, జ్యోతి, వరలక్ష్మమ్మ, గౌసియా బేగం, మేరీ, రవి, పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ నేల చూపులే

- వరి ధాన్యాల కుప్పలను పరిశీలించిన ఏపీ రైతు సంఘం నాయకులు

కడప అర్బన్ : జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలలో ఖరీఫ్‌లో వేసిన వరి ధాన్యం కోతలు కోస్తున్నారని, ప్రభుత్వం ధాన్యం సేకరించి ప్రతి గింజకూ మద్దతు ధర కల్పిస్తామని చెప్పడం ఉత్తిదే అని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరిరెడ్డి . శనివారం కడప రూరల్ ప్రాంతంలో రామనపల్లె, చిన్నమాసపల్లె,పెన్నా నది పరిహాక ప్రాంతాల గ్రామాల వరి ధాన్యాన్ని కలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కుందూ, పెన్నా చెయ్యేరు పాపాగ్ని , సాగు బోర్ల కింద వరి పంట కోతలు కోస్తున్నారని ఎకరానికి సగటున 35 -40 బస్తాలు పండుతున్నాయని పేర్కొన్నారు. ప్రయివేట్ దళారులు వ్యాపారస్తులు వడ్లు కొంటున్నారని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు పండించిన ప్రతి గింజను మద్దతు ధర చెల్లించి కొంటామని ఒకపక్క చెబుతున్నా జిల్లా ఉన్నతాధికారులు రైతు భరోసా కేంద్రాలకు ఇంతవరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జిల్లాలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. తేమశాతం పేరుతో నిబంధనలను సడలించాలని, దళారులను, ప్రయివేట్ వ్యాపారస్తులను నియంత్రించాలని చెప్పారు. తక్షణమే జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు జోక్యం చేసుకుని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని అంతటినీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతాంగాన్ని కలుపుకుని ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుట్టామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుబ్బారెడ్డి, ప్రసాద్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

కడప సిటీ : స్థానిక బాలాజీ నగర్ లోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు శని వారం ఘనంగా ప్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వీర సుదర్శన రెడ్డి మాట్లాడుతూ ప్రెష ర్స్‌డే నిర్వహించిన సీనియర్ విద్యా ర్థులకు అభినందనలు తెలిపారు. సీని యర్, జూనియర్ విద్యార్థులు కలిసి కలసికట్టుగా చదువుకోవాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహించే సమావేశాలు, సెమినార్లు, పోస్టర్ ప్రజెంటేషన్లు వంటి వాటిలో పాల్గొనే అవకాశాలున్నాయని చెప్పారు. సిఎస్ఎం విభాగాధిపతి పి.ఎ. రమేష్, ఇసిఇ విభాగాధిపతి బి. ప్రవీణ్ కుమార్, జి. శ్రీనివాసులు నాలుగు సంవత్సరాల బిటెక్ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడానికి కావాల్సిన సలహాలను ఇచ్చారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్. ఇలియాస్ అలీతోపాటు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్రెషర్స్‌డేలో విద్యార్థినులు

జాతీయ స్థాయిలో రాణించేలా తర్ఫీదు

కడప అర్బన్ : ప్రతిభ కలిగిన లలిత కళల విభాగం అధ్యాపకులు , విద్యార్థులు కాస్త శ్రమిస్తే అనతికాలంలోనే జాతీయ స్థాయిలో నిలబడతారని రిసోర్స్ పర్సన్ సురేష్ అన్నారు. శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగంలో 'కొచ్చి స్టూడెంట్ బినాలీ' వారు రెండవ దశలో భాగంగా ఈ నెల 3 నుంచి 5 వరకు వర్క్ షాప్ నిర్వహించనున్నారు. సంస్థ ప్రతినిధిగా, రిసోర్స్ పర్సన్‌గా తెలంగాణకి చెందిన బి.సురేష్ హాజరై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులక వర్క్ షాప్ వల్ల మరింత నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి.హెచ్.వెంకటేష్, అప్పలాచారి, బి. ఈరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు అవసరం

కాశినాయన : గ్రామాలలో సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రశాంతి తెలిపారు శనివారం కొండరాజుపల్లి పంచాయతీలోని వెల్నెస్ సెంటర్‌లో ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నడవలేని వారికి ఇంటి దగ్గరికి వెళ్లి వైద్యం చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా రెండుసార్లు 104 వాహనం మీ గ్రామానికి వస్తుందని , అక్కడ అన్ని సదుపాయాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు

5న వాహనాల వేలం పాట

ఒంటిమిట్ట (సిద్దవటం) : పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలంపాట ఈనెల 5న నిర్వహించనున్నట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ ఉరుకుందమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తమ కార్యాలయంలో వేలం ఉంటుందని ఆసక్తి కల్గిన వారు పాల్గొన్నాలని తెలిపారు.

మొక్కుబడి

ప్రజా దృష్టి

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన మొక్కుబడిగా సాగింది. జిల్లాలో సిఎం పర్యటన ఉంటుందనే వార్త వినగానే జిల్లా ప్రజానీకం పెద్దఎత్తున ఆశలు పెట్టుకుంటుంది. అందుకు తగిన విధంగానే ముఖ్యమంత్రులు ఆయా జిల్లాల పర్యటనల సందర్భంగా ప్రధాన సమస్యలను ప్రస్తావించడం, నిధుల కేటాయింపులు, వరాల జల్లులు కురిపించడం పరిపాటిగా మారడం తెలిసిందే. సిఎం తాజా జిల్లా పర్యటన అటువంటి జ్ఞాపకాల్ని, సంప్రదాయానికి విరుద్ధంగా సాగడం నిరుత్సాహాన్ని కలిగించింది. జిల్లా పర్యటన ఆసాంతం పులివెందుల నియోజకవర్గానికి పరిమితమైంది. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పులివెందులకు పరిమితమై రివ్యూలు నిర్వహించడం, ప్రొగ్రెస్ గురించి వివరించడం తెలిసిందే. తాజా పర్యటన సైతం లింగాల మండల నాయకులు, అధికారులతో కలిసి సంయుక్తంగా రివ్యూ నిర్వహణకు పరిమితమైంది. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులను ప్రస్తావించడం, చిత్రావతి రిజర్వాయర్‌కు అన్ని వనరులు పుష్కలముగా ఉన్నాయని, ప్రసిద్ధ జాతీయ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాననడం, స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొనడం మినహా లోతైన సమీక్ష చేయలేదనే ఇట్లే తెలిసిపోయింది. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం. దీనికి అనుగుణంగా వరాలు గానీ, ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతాంగానికి పరిహారాన్ని విడుదల చేయడం గానీ చేయకపోవడం ఉస్సూరుమనిపించింది. జిల్లా నీటి పారుదలశాఖ పరిధిలో ఉమ్మడి కడప జిల్లాలో 15 సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. కెసి కెనాల్ మినహా పూర్తిస్థాయిలో చివరి వరకు సాగునీటి సదుపాయం లేదు. మైలవరం, బ్రహ్మం సాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 వంటి ప్రాజెక్టుల పరిధిలో స్వల్ప ఆయకట్టు సాగవుతోంది. ఎల్ఎస్‌పి, అన్నమయ్య, మైలవరం రిజర్వా యర్ల మరమ్మతు ప్రతిపాదనలు ఆచరణ రూపం దాల్చకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. రాయలసీమకు గుండెకాయ లాంటి గండికోట రిజర్వాయర్‌కు సప్లయ్ ఛానళ్లు లేకపోవడంతో చుక్క నీటిని వినియోగించుకోలేని దుస్థితి దాపురించింది. ఇంతటి కీలకమైన సమస్య పట్ల ముఖ్యమంత్రి స్పందించాల్సిన అవసరం ఏర్పడింది. గండికోట రిజర్వాయర్‌కు సప్లయ్ ఛానళ్ల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉరుముతోంది. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని ఎనిమిది లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. దశాబ్దాల తరబడి కేటాయింపులు చేయకపోవడం, చేసిన కేటాయింపులను ఖర్చు చేయలేకపోవడం వంటి కారణాలతో జిల్లా ప్రజానీకాన్ని నిరుత్సాహ పరుస్తూనే ఉండడం తెలిసిందే. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు వంటి స్వల్ప మరమ్మతులు చేయడానికి కనీసం రూ.400 కోట్ల కేటాయింపులతో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అం దించే అవకాశం ఉందనే నిపుణుల సలహాలను చెవికి ఎక్కించుకో వాల్సిన అవసరం ఉంది. రాబోయే ఏడాదిన్నర సమయంలో ఉక్కు పరిశ్రమ మొదలు ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు చేసినప్పటికీ ముందుకు సాగని అయోమయ పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్ప వచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి- కడప

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ దిగుబడి దాదాపు 80 లక్షల టన్నులు ఉండగా, పూర్తి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం కేవలం 30 లక్షల టన్నులు మాత్రమే లక్ష్యంగా పెట్టుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. 5 రోజుల్లో కేవలం ఐదు లక్షల టన్నులు మాత్రమే సేకరించారని చెప్పారు. 17 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తాం అనడం సరికాదన్నారు. తేమ శాతం అధికంగా ఉన్నప్పటికీ, తడిసిన ధాన్యం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకటరమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా వైవీయూ ఆర్ట్స్ గ్యాలరీ

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆకర్షణీయంగా యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ గ్యాలరీ ఉందని ప్రొద్దుటూరు ఆర్‌టిఒ ఆర్.సుశీల కితాబిచ్చారు. శనివారం యోగి వేమన యూనివర్సిటీలో ఉన్న ' కళా దర్శన్ ఆర్ట్ గ్యాలరీ'ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైవీయూ గ్యాలరీ గురించి విన్నానని, చిత్రకళ అంటే ఆసక్తితో చూడడానికి వచ్చానని అన్నారు చిత్రాలన్నీ బాగున్నాయని, రూపొందించిన విద్యార్థులను ప్రశంసించారు. అనంతరం ఆర్‌టిఒకు జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో చరిత్ర పురావస్తు శాఖ ఆచార్యులు కె.గంగయ్య , ఫైన్ ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు వెంకటేష్, అప్పాలచారి, చినరాయుడు, బి ఈరప్ప పాల్గొన్నారు.

ఆకృతి షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప

నగరంలోని వైవి స్ట్రీట్‌లో నందు కిషోర్ నూతనంగా ఏర్పాటుచేసిన ఆకృతి షాపింగ్ మాల్‌ను శనివారం ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార రంగంలో కస్టమర్ల నమ్మకాన్ని సంపాదించి, దినదినాభివృద్ధి చెంది, భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సుబ్బారెడ్డి, మల్లికార్జున, కిరణ్, రామ లక్ష్మణరెడ్డి, ఎల్లారెడ్డి, నర్సారెడ్డి, జమాల్‌వల్లి, డిష్‌జిలాని ,సూర్య నారాయణ, తోట కృష్ణ, ఎల్లారెడ్డి, హరికృష్ణ, చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం సంతృప్తినిస్తుంది : 'చల్లా'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అన్నదానం చేయడంలో ఎంతో సంతృప్తి ఉందని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక అన్నర్ హాల్ వద్ద శనివారం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ అన్నదానం చేయడం నాకు దేవుడిచ్చిన వరమని తెలిపారు. ప్రతి నెల నాలుగు రోజుల అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తన సంపాదనలో కొంత భాగాన్ని ఇలాంటి సమాజ సేవ కార్యక్రమాలకు వెచ్చించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో చౌడం రవి, అక్రమ్, చల్లా రవి, జయచంద్ర, సీతంపల్లె రమణ, ప్రసాద్ రాయల్ పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న చల్లా రాజగోపాల్

పరీక్ష గడువు పెంచాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల సంఖ్యను, అభ్యర్థుల వయోపరిమితి, పరీక్ష సమయం గడువు పెంచలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేఖరులలో మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంవత్సరం 6,700 ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఆ హామీ ప్రకారం ఈ మూడేళ్లకుగానూ 20,100 పోస్టులు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఆ మేరకు పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. పరీక్షా సమయాన్ని కనీసం 3నెలలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు అందరూ ఏకమై ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్ రాజ్, పట్టణ అధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ స్థాయిలో ఆర్‌టిడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యోగి వేమన యూనివర్సిటీ డిగ్రీ 2, 4 సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజి విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి జిపిఎ సాధించారని కళాశాల కరస్పాండెంట్ తరుణేందు శేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు పరీక్షా ఫలితాల్లో మంచి ప్రతిబ కనబరిచారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల యాజమాన్యం అభినందించారు.



విద్యార్థులతో రాణి తిరుమలదేవి కళాశాల యాజమాన్యం

సెమిస్టర్ ఫలితాల్లో లేపాక్షి విద్యార్థులు...

యోగి వేమన యూనివర్సిటీ ప్రకటించిన 2, 4వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. నాలుగో సెమిస్టర్ విద్యార్థులు బి.కాంలో కె.సుస్మిత 8.98, బిఎస్‌సి ఎంపిసిలో లక్ష్మీ ప్రియ 9.37, ఎంఎస్‌సిఎస్‌లో విజయలక్ష్మి 9.17, రెడవ సెమిస్టర్‌లో బికాంలో కె.హేమంత్ 8.75, బిఎస్‌సి ఎంపిసిలో పి.సౌభాగ్య 9.75, ఎంఎస్‌సిఎస్‌లో తంజిమ్ భాయ్ 9.56 సాధించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కరస్పాండెంట్ వీర రాఘవరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

త్వరితగతిన ఐడిల నమోదు

- డిప్యూటీ సిఎం ముత్యాల నాయుడు

ప్రజాశక్తి - వేంపల్లె

పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ చర్చించి త్వరితగతిన ఐడిలను నమోదు చేసి, సమస్యల్లేకుండా చూస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్య మంత్రి బుడి ముత్యాల నాయుడు తెలిపారు. నంది పల్లె సర్పంచు మారం సులోచన శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు సర్పంచు బుద్ధ విగ్రహాన్ని అందజేశారు. అనంతరం సర్పంచు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 461 పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయన్నారు. వాటిలో నందిపల్లె కూడా ఒక్కటి అన్నారు. కొత్త పంచాయతీలకు నిధులు, అభివృద్ధిలో ఆన్‌లైన్ ఐడి కాలేదని మంత్రికి వివరించారు. ఆన్‌లైన్‌లో పాత ఐడిలు మాత్రమే చూపిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందించారు. పంచాయతీ రాజ్ డిఇ రవిచంద్రారెడ్డి, ఎపిఎస్ఆర్‌డి కో-ఆర్డినేటర్ మారం శ్రీకాంత్ పాల్గొన్నారు.



డిప్యూటీ సిఎంను సన్మానించిన సర్పంచ్ సులోచన

కాంట్రాక్ట్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమ సమస్యలను పట్టించుకోని ఆర్‌టిపిపి యాజమన్యాం, ప్రభుత్వం తీరుకు నిరసనగా శనివారం కాంట్రాక్ట్ కార్మికులు రీజినల్ జెఎసి ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. ఆర్‌టిపిపి కాలనీ మెయిన్ గేట్ నుండి పంప్ హౌస్ గేట్ వరకు భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ వెలుగునిచ్చే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ప్రభుత్వం, యాజమాన్యం వల్ల చీకటిలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ 163ను ఆర్‌టిపిపిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. బేషరతుగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు. పదమూడు రోజుల నుండి నిరసనలు చేస్తున్నా యాజమాన్యం చర్చలు కూడా చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.



భిక్షాటనతో వినూత్నంగా నిరసన చేపట్టిన కాంట్రాక్ట్ కార్మికులు

ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శ్రీకారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ, నీలాపురం గ్రామంలో పేదలకు కేటాయించిన జగనన్న కాలనీలో వాజ్‌పేయి నగర్, హిజ్రాల ఇళ్లకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. గతంలో శ్రీ కందుల బాలనాగిరెడ్డి కో-ఆపరేటివ్ సొసైటీ కాలనీ పేరున ఉన్న వాజ్‌పేయి నగర్ ప్లాట్లలోని ప్లాట్ నెంబర్ 81 నుండి 113 వరకు వాజ్‌పేయి నగర్ వాసులు ఆక్రమించి ఇల్లు నిర్మించారు. 2022లో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆక్రమితదారుల నుండి ప్లాట్లను యజమానులకు అప్పగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో అధికారులు వాజ్‌పేయి నగర్ వాసులను ఇల్లు ఖాళీ చేయించారు. ప్రతిపక్షాలు, పలు ప్రజా సంఘాలు, ఆక్రమితదారులు నాడు స్థానిక ఎమ్మెల్యే రాచమల్లుపై ఆరోపణలు గుప్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ తనపై వాజ్‌పేయి నగర వాసులు, టిడిపి నాయకులు, పలు ప్రజా సంఘాలు లేనిపోని ఆరోపణలు చేశారని తెలిపారు. తాను ఎప్పుడు కూడా పేద ప్రజల పట్ల గౌరవంగా వ్యవహరించానని తెలిపారు. రాబోవు రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు ఇక్కడ కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, పిట్టా బాలాజీ, వంశీధర్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

న్యాయ రాజధాని ఏర్పాటుకు పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి, వైసిపి నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

రాయలసీమ అన్ని రకాలుగా వెనుకబడి ఉందని, అభివృద్ధిలో భాగంగా కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కలిసి పోరాడాలని ఎంపిపి టి.లక్ష్మమయ్య పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన వైసిపి మండల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కర్నూలులో రాజధానిని కోల్పోయామన్నారు. ప్రస్తుతం న్యాయ రాజధానిని సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అందులో భాగంగా ఈ నెల 5న కర్నూల్‌లో జరిగే రాయలసీమ గర్జన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. గతంలో కర్నూలు రాజధానిగా ఉండటం వల్ల ప్రస్తుతం న్యాయ రాజధానిగా ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు న్యాయం జరగాలంటే న్యాయ రాజధానిగా కర్నూలు సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ జయసుబ్బారెడ్డి, ఎన్ ఓబాయపల్లి ఉప సర్పంచు వెంకటసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, జైనుల్లా పాల్గొన్నారు.

రాక్షస పాలన సాగనివ్వం : పుట్టా

ప్రజాశక్తి - మైదుకూరు

రాష్ట్రంలో ఇక నుంచి రాక్షస పాలనను సాగనివ్వబోమని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అంతమయ్యే రోజుల దగ్గర పడ్డాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన తెలిపారు. మైదుకూరు సంతను మార్చడం ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ధనపాల జగన్, అన్నవరం సుధాకర్‌రెడ్డి, బిఎన్ శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరి కృషితోనే టిడిపి విజయం సాధ్యం

ఖాజీపేట : అందరి కృషితోనే టిడిపి విజయం సాధ్యమని ఆ పార్టీ మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బండి చిన్న, బండి వెంకటేష్‌తోపాటు పలు కుటుంబాలు పుట్టా, టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపికి రంగాపురం కంచుకోటగా ఉందని, ఇరువురు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికీ రక్షణ లేకుండా పోయిందన్నారు. జీవనం భారంగా మారిందని తెలిపారు. అనంతరం ఇదేమి ఖర్మ.. రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, కమలాపురం గౌస్‌మొద్దీన్, త్రిపురవరం హరి నాథ్‌రెడ్డి, చెన్నముక్కపల్లి నరసింహులు యాదవ్, రెడ్యం వెంకట్రామిరెడ్డి, గంగిరెడ్డి, రాము యాదవ్, కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, రామానాయుడు, పత్తూరు ఉప సర్పంచు ముత్తూరు రమణ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గంగాధర్, జలీల్ అహ్మద్, మామిళ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మైదుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

పురాతన శివాలయ సందర్శన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని కల్లూరులో ఉన్న పురాతన శివాలయాన్ని శనివారం విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి సందర్శించారు. కల్లూరు మాజీ సర్పంచు, వైసిపి ప్రచార జిల్లా కన్వీనర్ నాగేంద్రారెడ్డి ఆహ్వానం మేరకు ఆయన విచ్చేశారు. అనంతరం గుడి విశిష్టతను ధర్మకర్త వల్లూరు రాజ గోపాల్‌రెడ్డి వివరించారు. నాగేంద్రారెడ్డి నూతన గృహాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ మారుతీప్రసాద్, కల్లూరు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



నాగేంద్రారెడ్డి నివాసంలో శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.55 లక్షలతో నాడు -నేడు నిధుల ద్వారా మూడు అదనపు గదుల నిర్మాణానికి శనివారం చియ్యపాడు ఎంపిటిసి ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే చియ్యపాడు హైస్కూల్‌లో మూడు అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి విద్యార్థులకు తరగతుల గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపిటిసి బాల నరసింహారెడ్డి

వ్యతిరేక విధానాలతో పరిశ్రమ రంగానికి ముప్పు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో పారిశ్రామిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుడడంతో పరిశ్రమ రంగానికి ముప్పు అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ దెబ్బకు పరిశ్రమ రంగం అబ్బా అంటోందన్నారు. వైసిపి ప్రభుత్వం యువత పొట్ట కొట్టడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ అసమర్థత, అవినీతి, అరాచకం, పార్టీ నాయకుల రౌడీ మామూళ్లు, మౌలిక సదుపాయాల కొరత, రాజధాని అనిశ్చిత తదితర కారణాల వల్ల రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కుంటు పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రిలయన్స్ కంపెనీ తిరుపతి నుండి పారిపోయిందన్నారు. టైటాన్ జంప్ కాగా కియా విస్తరణ ఆగిపోయిందని వివరించారు. లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్ టన్ విశాఖ నుండి పారిపోయినట్లు చెప్పారు. కడప జిల్లాలో జువారీ సిమెంటు కర్మాగారం విస్తరణ ఆగిపోయిందన్నారు. దుస్తుల తయారీ కంపెనీ ఫేజ్ ఇండస్ట్రీస్ అనంతపురం నుండి తెలంగాణకు తరలిపోయిందన్నారు. అమరరాజా కంపెనీ రాష్ట్రానికి, దేశానికి గర్వ కారణమన్నారు. ఆ కంపెనీ 16 వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, 50 వేల కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి కల్పించిన కామధేనువు అన్నారు. అలాంటి కంపెనీ మీద జగన్ ప్రభుత్వం కాలుష్య నియంత్రణ బోర్డుచే దాడులు చేయించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, స్వయం ఉపాధి పథకాల్లేవన్నారు. ప్రయివేట్ రంగంలో పరిశ్రమలు రావడంలేదన్నారు. ఎన్నికల్లో నిరుద్యోగ యువత క్రోదాగ్ని జ్వాలల్లో వైసిపి మాడి మసి అయిపోతుందన్నారు.

విభిన్నప్రతిభావంతుల పట్ల చిన్నచూపు తగదు

ప్రజాశక్తి - కడప/కడప అర్బన్

వికలాంగుల సమస్యల పరిష్కారం పై వారికి అవగాహన కల్పించాలని, అందరితో సమానంగా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత సూచించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం వికలాంగుల దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కృష్ణ కిషోర్, ఐఆర్‌టి కో-ఆర్డినేటర్ కేశవరెడ్డి, పునరావాస అధికారి శ్రీకాంత్, ఎన్జీవోలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల:** సమాజంలో వికలాంగుల పట్ల ఆదరా భిమానాలు కలిగి ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని భవిత సెంటర్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఇఒ రఘు రాములు, బ్రహ్మంగారిమఠం సర్పంచ్ సోమిరెడ్డి పల్లె రామయ్య, టేకూర్‌పేట సర్పంచ్ రమణా రెడ్డి , టీచర్ సురేంద్ర రెడ్డి, ఇన్ క్లుసివ్ ఎడ్యుకేషన్ టీచర్ సునీల్, బద్దెన కళా పీఠం అధ్యక్షుడు గంగాసాని సాంబశివారెడ్డి పాల్గొన్నారు. **ఒంటిమిట్ట(సిద్దవటం):** సిద్ధవటం భవిత పాఠశాలలో శనివారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. సిద్దవటం జూనియర్ సివిల్ జెడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ శంకరయ్య, డాక్టర్ మధుశేఖర్, న్యాయవాది సుధామని కోర్టు, భవితా స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు **అల్ షిఫా విద్యార్థులు ర్యాలీ :** అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ సందర్భంగా పాత రిమ్స్‌లో ఉన్న అల్ షిఫా కేంద్రంలోని పిల్లలు, విద్యార్థులు శనివారం ర్యాలీని నిర్వహించారు. 25 వ డివిజన్ హెల్త్ సెక్రటరీ కవిత, అల్ ఫిఫా నిర్వాహకులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కో-ఆపరేటివ్ కాలనీ నుంచి మొదలై మున్సిపల్ స్టేడియం వద్ద ముగిసింది. కార్యక్రమంలో నాయకుల వేశాధారణంలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. **విద్యార్థులకు బహుమతులు ప్రదానం..** ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హెలెన్ కెల్లర్ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఏడి కృష్ణ కిషోర్ సర్టిఫికెట్లు, మెమోంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అథారిటీ జడ్జి కవిత, హెలెన్ కెల్లర్ కరస్పాండెంట్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్, ప్రిన్సిపాల్ మసూద్ బేగం, ఐఆర్టి కేశవరెడ్డి, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. **చాపాడు :** విభిన్న ప్రతిభావంతుల పట్ల చిన్నచూపు తగదని ఎంఇఒ వి.రవిశంకర్ పేర్కొన్నారు. ఐఆర్‌టి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక భవిత సెంటర్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఒ మాట్లాడుతూ ప్రోత్సాహం ఇస్తే వారు కూడా అద్భుతాలు సృష్టిస్తారన్నారు. పాఠశాలకు రావడం వల్ల వారి జీవన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారని పేర్కొన్నారు. బద్రిపల్లెకు చెందిన డేగల సావిత్రమ్మ విభిన్నప్రతిభావంతుల పిల్లలకు రూ.8వేలు విలువ చేసే ఆట, విద్య సామగ్రిని అందజేశారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గౌస్ మొద్దీన్, ఫైరోజ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **మైదుకూరు :** అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక భవితా కేంద్రంలో పిల్లలకు ప్లేట్లు, టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. వివిధ రకాలైన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైదుకూరు బిజెపి ఇన్‌ఛార్జి మాచునూరు సుబ్బరాయుడు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాలగంగాధర్, న్యాయవాది ఆకుల వెంకటరమణ. కామనూరు శ్రీనివాసులు. ఉపాధ్యాయులు కోటయ్య, కుమారి, నిర్మల పాల్గొన్నారు. **వేంపల్లె :** విభిన్న ప్రతిభావంతులకు సేవ చేయడం అదృష్టంగా ప్రతి ఒక్కరూ భావించాలని ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక భవిత సెంటర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వీన్ మాట్లాడుతూ వేంపల్లె భవిత సెంటర్ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన మదర్ థెరిస్సా విభిన్న ప్రతిభావంతుల సేవా సమితి ప్రతినిధులు షాకీర్ హుస్సేన్, అల్తాఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఐఇఆర్‌టి రామాంజనేయురెడ్డి విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు చేశారు. ఐఆర్‌టిలు యశోద, రామాం జనే యులురెడ్డి, ఫిజియోథైరపిస్టు డాక్టర్ ఆనంద్, సిజివి సుజాతను శాలువతో సత్కరించారు. విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు రాజా పంపిణీ చేశారు. కార్యక్రమంలో భవిత సెంటర్ సిబ్బంది, సిఆర్‌పిలు నాగరాణి, సూర్యకుమారి, అబ్దుల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** విభిన్న ప్రతిభావంతులను చిన్నచూపు చూడకుండా వారిని ప్రేమతో ఆదరించాలని ఎంపిడిఒ అరుంధతి, ఎంఇఒ క్రిష్టఫర్ తెలిపారు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక భవిత కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిఆర్ పి.చంద్రమోహన్, ఉపాధ్యాయులు అనురాధ,లక్ష్మయ్య, ఫిజియోథెరపీ సుదర్శన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాంను బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్య పెద్దిరాజు, న్యాయవాది పాలాజీ రవికుమార్ నిర్వహించారు.



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

చర్చి ఆధునికీకరణకు విరాళం

మైదుకూరు : స్థానిక బద్వేలు రోడ్డులోని పునీత జోజప్ప దేవాలయం (ఆర్‌సిఎం చర్చి)లో ఆధునికీకరణకు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి రూ.2లక్షలు విరాళం ఇచ్చారు. ఆ మేరకు శనివారం ఆయన నగదును స్థానిక చర్చి ప్రాంగణంలో బిషప్ గాలి బాలికి అందజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డిని వారు సన్మానించారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు.



చర్చిలో రాచమల్లు రవిశంకర్‌రెడ్డి

ఎమ్మెల్యే ప్రమేయం లేదు

ప్రొద్దుటూరు : వాజ్‌పేయి నగర్‌ను ఖాళీ చేయించే విషయంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డికి ఎలాంటి ప్రమేయం లేదని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి తెలిపారు. ఆ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆ స్థల యజమానులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. దాదాపు లక్ష ఓట్లు పైచిలుకు మెజార్టీతో గెలవాలనే తలంపుతో ఎమ్మెల్యే పనిచేస్తున్నారన్నారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ మాదిగ మాట్లాడుతూ వాజ్‌పేయి నగర్ ఆక్రమణదారులకు ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయమని హైకోర్టు ఉత్తర్వుల మేరకు అధికారులు ఖాళీ చేయించారన్నారు. సమావేశంలో జిల్లా ఎంఆర్‌పిఎస్ యువసేన అధ్యక్షుడు నల్లగట్ల కొండయ్య పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రానికి గ్యాస్ సిలిండర్ వితరణ


అంగన్వాడీ సెంటర్‌కు గ్యాస్ సిలిండర్ ఇస్తున్న దాత

ప్రజాశక్తి - రాయచోటి

యన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బిరాంసాబ్ వీధిలోని అంగన్వాడీ కేంద్రానికి శనివారం గ్యాస్ సిలిండర్, స్టవ్‌ను వితరణ చేశారు. సుండుపల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన దాత నరేంద్రాచారి శనివారం అందజేశారు. అంగన్వాడీ కేంద్రంలోని చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఇతర అవసరాలకు గ్యాస్ సిలిండర్, స్టవ్ ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో తమ వంతు సహకారంతో అందజేశామని దాత చెప్పారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో లయన్స్ క్లబ్ తరపున విద్య, వైద్యం, ఇతర ముఖ్యమైన సేవలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలందరికీ ఉచితంగా సేవలందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హరి(చింటు), లయన్స్ క్లబ్ సభ్యులు బాబు పాల్గొన్నారు.

ముగిసిన సిఎం పర్యటన


కడప విమానాశ్రమంలో సిఎంకు వీడ్కోలు పలుకుతున్న నేతలు, అధికారులు

ప్రజాశక్తి పులివెందుల టౌన్(వైఎస్ఆర్ జిల్లా)

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లా రెండు రోజుల పర్యటన శనివారంతో ముగిసింది. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు శనివారం తన వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్ కుమార్తె వివాహానికి సిఎం జగన్, ఆయన సతీమణి భారతి హాజరై వధూవరులు హేమలత, గంగాధర్‌లను ఆశీర్వదించారు. అనంతరం ఉదయం 10 గంటలకు హెలికాప్టర్ ద్వారా కడప విమానాశ్రయం చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయ లుదేరారు. కడపలో సిఎం జగన్‌కు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా, కడప ఎంపీ వైఎస్. అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు, ఎస్‌పి అన్బురాజన్, నగర మేయర్ కె.సురేష్ బాబు, రాజంపేట, రాయచోటి, కాకినాడ ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రాయలసీమ డిఐజి సెంథిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, కడప, జమ్మలమడుగు ఆర్‌డిఒలు ధర్మ చంద్రారెడ్డి, శ్రీనివాసులు, కడప డిఎస్పీ శివారెడ్డి, ఎయిర్ పోర్ట్ అధికారి శ్రీనివాస్ వీడ్కోలు పలికారు.

రైతు, ఇద్దరు చిన్నారుల చికిత్సకు ఆర్థిక సాయం

వివిధ వ్యాధులతో బాధపడుతున్న అనంతపురానికి చెందిన ఓ రైతు, పులివెం దులకు చెందిన ఇద్దరు చిన్న పిల్లల మెరుగైన వైద్య కోసం రెండు కుటుం బాలకు ఆర్థిక సహాయం అంది స్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లా, నార్పల మం డలం, గూగూడు గ్రామానికి చెందిన జగన్మో హన్‌రెడ్డి అనే రైతు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధప డుతున్నట్లు భార్య శివజ్యోతి తమ ముగ్గు రు పిల్లలతో సౌమ్య, హరిప్రియ, యామి నిలతో కలసి శనివారం పులివెందుల హెలిప్యాడ్ వద్ద సిఎంను కలసి అర్జీ సమర్పించారు. నవంబర్ 12 నుండి ఆస్టర్ సిఎంఇ బెంగళూరు హాస్పి టల్‌లో చికిత్స పొందుతున్న నా భర్తకు రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారని, మీరే ఆదుకోవాలని సిఎంకు విన్నవించింది. అనంతరం వారితో మాట్లాడిన ముఖ్యమంత్రి తక్షణమే రూ.2 లక్షలు మీ అకౌంట్‌లోకి వేస్తామని, పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరించి చికిత్స అంది స్తామని భరోసా కల్పించారు. పులివెందులలో నివసిస్తున్న కె,శివకు మార్ టైలరింగ్ చేసుకుంటూ భార్య జి.వరలక్ష్మి గృహిణిగా ఇద్దరు పిల్లలు 8 ఏళ్ల హైందవ్, 5 ఏళ్ల కుషల్‌తో జీవనం సాగిస్తు న్నామని తెలిపారు. మా ఇద్దరు పిల్లలు తీవ్రమైన అనిమియా వ్యాధితో బాధ డుతున్నట్లు వారికి రక్తం పెరుగుదలకు ఇంజక్షన్ వాడుతు న్నామన్నారు. పిల్లల ఆరోగ్యం కోసం చెన్నై, బెంగ ళూరు వంటి మహా నగరాలు తిరిగినామన్నారు. ఈ వ్యాధి ఆరోగ్య శ్రీ కిందకు రాదన్నారని ప్రస్తుతం హైదరాబాద్ లోని అమెరికన్ అంకాలజిస్ట్ దగ్గర చికిత్స చేయిస్తున్నామని ఇప్పటికి రూ.15 లక్షలు ఖర్చు అయిందని,సర్వం అమ్ముకొని కోల్పోయామని మీరే మమ్మల్ని మా పిల్లల్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి ని కలసి అర్జీ సమర్పించారు. అనంతరం సిఎం పిల్లల మెరుగైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు.

విజృంభిస్తున్న 'లంపీ స్కిన్'

- పశువులు, ఆవులకు సోకుతున్న వైరస్
- లబోదిబోమంటున్న పాడి రైతులు
- మండలానికి ఒక్కరే పశువైద్యులు
- అంతర్రాష్ట్ర పశు రవాణాపై నిషేదం

ప్రజాశక్తి - రామసముద్రం

జిల్లాలో పశువులు, ఆవులు, ఎద్దులకు సోకుతున్న లంపీ స్కిన్ వ్యాధి విజృంభిస్తోంది. ఈ వ్యాధి పశువుల్లో వేగంగా వ్యాప్తి చెందుతోంది. పశువులు ఈ వ్యాధి బారినపడి మృతి చెందుతున్నాయి. అనేక పశువులు ఇప్పటికే వ్యాధితో బాధపడుతున్నాయి. వ్యాధి ముదిరితే రెండు వారాల్లోనే పశువులు మృత్యువాతపడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దోమలు, ఈగలు, గోమార్ల ద్వారా సంక్రమించే క్యాప్రిపాక్స్ వైరస్‌కు ఇటీవల కురుస్తున్న వర్షాలు, చలి వాతావరణం కూడా తోడైందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ద్వారా వ్యాక్సిన్ ఇప్పటికే అందించినా.. ఫలితం లేకపోయింది. లంపీ స్కిన్ వ్యాధి తగ్గినట్లే తగ్గి కొద్ది రోజులుగా అధికంగా విజృంభించి పశువుల ప్రాణాలు తీస్తుంది. మండల వ్యాప్తంగా సుమారు ఆవులు, పశువులు, ఎద్దులు, దూడలు, 12 వేల వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 5 వేల పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకింది. మండలంలో చాలా మంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి పశువులు కొనుగోలు చేసి పాల ఉత్పత్తులు ద్వారా జీవనం సాగిస్తున్నారు. సంవత్సరంలో ఎదో ఒక సీజన్లో వింత రకాల వ్యాధులు పశువులకు సోకి ఎన్నో పశువులు మృతి చెందుతున్నాయి. పాడి పరిశ్రమదారులు చాలా మంది నష్టపోతున్నారు.

లంపీస్కిన్ లక్షణాలివే..

లంపీస్కిన్ లక్షణాలున్న పశువులకు తీవ్రమైన జ్వరం వస్తుంది. కంటి నుంచి నీరు కారడం, చర్మంపై పెద్దపెద్ద గడ్డలు, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, చర్మమంతా పొలుసులుగా మారడం, పశువు మేత తినకపోవడం, పాలివ్వకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

వింత వ్యాధితో నష్టపోతున్న రైతులు

లంపీ స్కిన్ వ్యాధితో పశువులు మృతి చెందుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 'ప్రభుత్వం అందించే ఇన్సూరెన్స్


లంపీ స్కిన్ వ్యాధి సోకిన ఆవు

ఇనాఫ్ ట్యాగ్'లు ఉన్నటువంటి పశువులు మృతి చెందినా పశువులకు పోస్టుమార్టం చేయించడానికి పాడి రైతులు నిరాకరిస్తున్నారు. నిబంధనలు ప్రకారం మృతి చెందిన పశువుల వ్యాధి లక్షణాలు తెలుసుకోవడానికి పశు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి నివేదిక అందిస్తే పాడిరైతులు ఇన్సూరెన్స్ పొందుతారు. కొన్ని చోట్ల కన్న బిడ్డలవలే పెంచుకుంటున్న పశువులు మృతి చెందితే పోస్టుమార్టం చేయించడానికి పాడి రైతులు ముందుకు రావడం లేదు.

ముగ్గురికి ఒక్కరే వైద్యుడు..

మండలానికి ముగ్గురు పశువైద్యాధికారులు ఉండాల్సి ఉంది. మండలంలోని చెంబకూరు, కుదురుచీమనపల్లి, రామసముద్రం ప్రాంతాల్లో ముగ్గురు పశువైద్యులు ఉండాల్సిన అవసరం ఉంది. చెంబకూరు గ్రామంలో మాత్రమే పశువైద్యులు వుండటంతో మిగిలిన ప్రాంతాల్లో ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో మూగా జీవాల పాలిట శాపంగా మారింది. రామసముద్రం, మరియు కుదురుచీమనపల్లి ప్రాంతాల్లో పశువైద్యులును నియమించాల్సి ఉంది. మండలంలో ఖాళీగా ఉన్న పశువైద్యులను వెంటనే భర్తీ చేసి పాడిపరిశ్రమ ఆదుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

పోస్టుమార్టం నిరాకరిస్తున్న రైతులు

రామసముద్రం పంచాయతీ ఊటుగొల్లపల్లి గ్రామానికి చెందిన ఓ పాడి రైతుకు చెందిన రెండు పాడి పశువులు కొన్ని రోజుల క్రితం మృతి చెందాయి. వాటిని కన్నబిడ్డలు వలే పెంచుకున్నందుకు కళ్ళముందే వాటిని పోస్టుమార్టం చేయయించడానికి మనసు ఒప్పుకోలేదు. అందుకే మా పాడి అవులకు ఇన్సూరెన్స్ రాలేదు. మా ఇష్ట దైవంగా భావించే పశువులను కళ్ళముందే పోస్టుమార్టం చేయించడం ఇష్టం లేకే ఇన్సూరెన్స్ పొందలేక పోయాను.

రోగం గురించి చెప్పేవారే లేరు

పశువులు లంపీస్కిన్ వ్యాధి బారినపడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఏ మందులు వాడాలి వంటి విషయాలు చెప్పేవారు మాకు అందుబాటులో లేరు.

- శ్రీరాములు, బల్లసముద్రం.

వ్యాక్సిన్ ఇచ్చారు..

లంపీస్కిన్ వ్యాధి నుంచి ఆవులను కాపాడేందుకు పశు వైద్యులు మా ఆవులకు వ్యాక్సిన్ ఇచ్చారు. ఆవులను మందలోకి వదలకుండా నేనే మేతకు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకొస్తున్నా. ఒక ఆవు మృతి చెందింది.

- శంకర, దిగువపల్లె.

మూడు ఆవులకు సోకింది

మా మూడు ఆవులకు లంపీస్కిన్ వ్యాధి సోకింది. ఆవుల శరీరంపై దద్దుర్లు వచ్చాయి. మూడు పశువుల వైద్యానికి రూ.18 వేలు ఖర్చు చేశాను. ఒక ఆవు మృతి చెందింది. రెండు కోలుకుంటున్నాయి. పశు వైద్యాధికారికి చెబితే వచ్చి టీకాలు వేశారు. జాగ్రత్తలు చెప్పారు.

- అన్సర్‌బాషా, తిరుమలరెడ్డిపల్లె.

ముందస్తు చర్యలు చేపట్టాం

జిల్లాలో తెల్ల పశువులు 2,76,417, గేదెలు 1,00,588, గొర్రెలు 18,24,325, మేకలు 3,53,370, కోళ్లు 23,82,260, కోళ్ల ఫారాలు మదనపల్లె, పీలేరు, కలికిరి ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి. లంపీ స్కిన్ చర్మ వ్యాధికి సంబంధించి ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటి వరకు 55,500 పశువులకు టీకాలు వేశాం. 175 వేల డోస్‌లు పంపిణీ చేశాం. వ్యాధిని అరకట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పశువుల సంతలను మూసి వేయించాం. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన మదనపల్లె వంటి ప్రాంతాలలో చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా స్థాయి వరకు రైతులకు అనేక అవగాహన సదస్సును, వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం.

- గుణశేఖర్ పిళ్లై, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి.

శ్రీనాథరెడ్డితో 'చింతల' భేటీ


శ్రీనాథరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డితో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి భేటీ అయ్యారు. శనివారం స్థానిక కోటపల్లెలోని శ్రీనాథరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి గతాన్ని గుర్తుకు చేసుకున్నారు. శ్రీనాథరెడ్డి త్వరలో వైసిపిలో చేరనున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను కలసి గత, ప్రస్తుత రాజకీయ స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. పీలేరు నియోజకవర్గంలో వైసిపి మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణ, ఇతర అంశాలపై కూడా చర్చించుకున్నారు. అనంతరం వైఎస్సార్సీపీ నాయకుడు అబ్దుల్ రెహమాన్, తారాజాన్ కుమారుడు సన్నీ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎల్బీఎస్ రోడ్డులోని సత్యనారాయణ టెక్స్టైల్స్ అధినేత నగేష్ తల్లి కలవల నాగరత్నమ్మ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి వారికి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో వైసిపి మండల కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కడప గిరిధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ హుమయూన్, వైస్ ఎంపిపి వెంకటాచలపతి, మైనార్టీ నాయకులు అబ్దుల్ కలీం, కాలనీ చిన్న. టూరిజం శాఖ జిల్లా బోర్డు సభ్యుడు షాకీర్, మునీర్, అబీద్, హబీబ్, విజయశేఖర్ రెడ్డి, కంభం నరశింహారెడ్డి, అబ్దుల్ పాల్గొన్నారు.

మొక్కుబడి

ప్రజాదృష్టి

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన మొక్కుబడిగా సాగింది. జిల్లాలో సిఎం పర్యటన ఉంటుందనే వార్త వినగానే జిల్లా ప్రజానీకం పెద్దఎత్తున ఆశలు పెట్టుకుంటుంది. అందుకు తగిన విధంగానే ముఖ్యమంత్రులు ఆయా జిల్లాల పర్యటనల సందర్భంగా ప్రధాన సమస్యలను ప్రస్తావించడం, నిధుల కేటాయింపులు, వరాల జల్లులు కురిపించడం పరిపాటిగా మారడం తెలిసిందే. సిఎం తాజా జిల్లా పర్యటన అటువంటి జ్ఞాపకాల్ని, సంప్రదాయానికి విరుద్ధంగా సాగడం నిరుత్సాహాన్ని కలిగించింది. జిల్లా పర్యటన ఆసాంతం పులివెందుల నియోజకవర్గానికి పరిమితమైంది. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పులివెందులకు పరిమితమై రివ్యూలు నిర్వహించడం, ప్రొగ్రెస్ గురించి వివరించడం తెలిసిందే. తాజా పర్యటన సైతం లింగాల మండల నాయకులు, అధికారులతో కలిసి సంయుక్తంగా రివ్యూ నిర్వహణకు పరిమితమైంది. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులను ప్రస్తావించడం, చిత్రావతి రిజర్వాయర్‌కు అన్ని వనరులు పుష్కలముగా ఉన్నాయని, ప్రసిద్ధ జాతీయ పర్యటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాననడం, స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొనడం మినహా లోతైన సమీక్ష చేయలేదనే ఇట్లే తెలిసిపోయింది. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం. దీనికి అనుగుణంగా వరాలు గానీ, ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతాంగానికి పరిహారాన్ని విడుదల చేయడం గానీ చేయకపోవడం ఉస్సూరుమనిపించింది. జిల్లా నీటి పారుదలశాఖ పరిధిలో ఉమ్మడి కడప జిల్లాలో 15 సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. కెసి కెనాల్ మినహా పూర్తిస్థాయిలో చివరి వరకు సాగునీటి సదుపాయం లేదు. మైలవరం, బ్రహ్మం సాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 వంటి ప్రాజెక్టుల పరిధిలో స్వల్ప ఆయకట్టు సాగవుతోంది. ఎల్ఎస్‌పి, అన్నమయ్య, మైలవరం రిజర్వా యర్ల మరమ్మతు ప్రతిపాదనలు ఆచరణ రూపం దాల్చకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. రాయలసీమకు గుండెకాయ లాంటి గండికోట రిజర్వాయర్‌కు సప్లయ్‌ఛానళ్లు లేకపోవడంతో చుక్క నీటిని వినియోగంచుకోలేని దుస్థితి దాపురించింది. ఇంతటి కీలకమైన సమస్య పట్ల ముఖ్యమంత్రి స్పందించాల్సిన అవసరం ఏర్పడింది. గండికోట రిజర్వాయర్‌కు సప్లయ్ ఛానళ్ల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉరుముతోంది. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని ఎనిమిది లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. దశాబ్దాల తరబడి కేటాయింపులు చేయకపోవడం, చేసిన కేటాయింపులను ఖర్చు చేయలేకపోవడం వంటి కారణాలతో జిల్లా ప్రజానీకాన్ని నిరుత్సాహ పరుస్తూనే ఉండడం తెలిసిందే. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు వంటి స్వల్ప మరమ్మతులు చేయడానికి కనీసం రూ.400 కోట్ల కేటాయింపులతో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అం దించే అవకాశం ఉందనే నిపుణుల సలహాలను చెవికి ఎక్కించుకో వాల్సిన అవసరం ఉంది. రాబోయే ఏడాదిన్నర సమయంలో ఉక్కు పరిశ్రమ మొదలు ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు చేసినప్పటికీ ముందుకు సాగని అయోమయ పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్ప వచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

లాభాలొచ్చే పంటల వైపే మొగ్గు చూపాలి

రాష్ట్ర వ్యవసాయ అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

లాభాలొచ్చే పంటల్నే రైతులు పండించేలా అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో వ్యవసాయ, అనుబంధరంగాలపై సమీక్ష, చర్చా కార్యక్రమం జెసి తమీమ్ అన్సారియా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు, సలహాలు, సూచనలను సిఎం దృష్టికి తీసుకువెళ్లటానికి జిల్లాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా 23 జిల్లాలలో చర్చా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. వ్యవసాయ మిషన్ ఉన్నత స్థాయి సలహాలను ప్రభుత్వానికి అందిస్తుందని ఆయన చెప్పారు. ప్రత్యేక బాధ్యతతో ముఖ్యమంత్రి వ్యవసాయ మిషన్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. రైతులకు, ప్రభుత్వ యంత్రాంగానికి అత్యంత సాన్నిహిత్యం ఉండాలని, తద్వారా సమస్యలు సులభంగా పరిష్కారం అవుతాయని ఆయన చెప్పారు. అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి పంటలను వేయాలని సూచించారు. రైతులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లల్లో భూమిపై ఆపేక్షను పెంచాలని ఆయన పిలుపునిచ్చారు జిల్లాలో సమస్యలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలు, బాగోగులు తెలుసుకోవడానికి రాష్ట్ర వ్యవసాయ అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ అన్నమయ్య జిల్లాకు రావడం చాలా సంతోషంగా


సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఉందన్నారు. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు అందరూ కూడా సమన్వయంతో రైతుకు ఉపయోగపడాలన్నారు. జెసి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం రైతుల పట్ల, వ్యవసాయం పట్ల అత్యధిక శ్రద్ధ చూపుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ స్థితిగతులను గురించి జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ వివరించారు. వివిధ మండలాల నుంచి వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, సభ్యులు, రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లా అధికారులు శాఖా పరంగా అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సమావేశం అనంతరం జిల్లాలోని పాడి రైతులకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పెయ్య దూడల ఉత్పత్తి పథకానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆంధ్రప్రదేశ్ పశుగణ అభివృద్ధి సంస్థ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు ఎం.చంద్రశేఖర్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన, మత్స్యశాఖ, ఎపిఎంఐపి, సిరికల్చర్, అనుబంధ జిల్లా అధికారులు, రైతులు పాల్గొన్నారు.


మురుగు కాలువలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

రాష్ట్రంలో అరాచక పాలన

- మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధోగతిపాలైందని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి మున్సిపాలిటీలోని 6వ వార్డు కొత్తపల్లిలో టిడిపి ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి వార్డులో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనసాగుతున్న అవినీతి అరాచక పాలన ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. టిడిపి నాయకులపై దాడులు, అక్రమ కేసులు అధికమయ్యాయని వాపోయారు. మహిళలపై అఘాయిత్యాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు అసంఘటిత, విద్యుత్, భవన నిర్మాణ, అంగన్వాడీ కార్మికులు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పనిభారంతో అల్లాడుతున్నారని వాపోయారు. ఏడాది కిందట వచ్చిన వరదల్లో అన్నమయ్య, పింఛ ప్రాజెక్టులు తెగిపోతే ఇప్పటి వరకూ వాటిని గురించి పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు మన రాష్ట్రానికి ఇదేమి కర్మ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర వ్యవస్థ గాడిన పడాలంటే రాబోయే 2024 ఎన్నికల్లో తప్పనిసరిగా చంద్రబాబు సీఎం కావాలని, అందుకు ప్రజలంతా తెలుగుదేశం పార్టీని ఆదరించి రాష్ట్రాన్ని రౌడీ మూకల అరాచకాల నుండి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్ వలి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, రాజంపేట పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి నిస్సార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ ఎస్.కె హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, సోనీరాజ్ కలిమ్, టిడిపి నేతలు మైనుద్దీన్, బాబు రెడ్డి, మన్సూర్, ప్రసాద్, కొట్టే చలపతి మహబూబ్‌బాషా, అమవాస్య రెడ్డయ్య ఇలియాజ్, ముబారక్, హాజీ, జావిద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపు మాపాలి

ప్రజాశక్తి-వీరబల్లి

లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యునేసేఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ వినోద్ సింగ్ అన్నారు. శనివారం గ్రందేవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జెండర్ మాసోత్సవాలలో భాగంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహాలు, లింగ వివక్షత వంటి అంశాలపై అవగాహన పెంచడం మాసోత్సవాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ, గృహ హింస వంటివి సమాజానికి ప్రమాదకరమని తెలిపారు. రక్తహీనత పై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎఒ ఖాదర్ వలి, సిసిలు బాలగుర్రయ్య, శంకర్ నాయక్, సుబ్బరాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవినాథబాబు, రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒలు ప్రతి ఇంటినీ సందర్శించాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 44 పోలింగ్ బూత్‌లో ఉన్న బిఎల్‌ఒలు శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ కింద బూత్ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించాలని తహశీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. శనివారం 179వ పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఊరు వదిలి వెళ్లిన వారి ఓట్లను తొలగించాలన్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వారు పల్లెలలో ఓటు ఉండి తిరిగి పట్టడానికి వచ్చిన వారు తిరిగి ఓటు నమోదు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిఎల్‌ఒ సి. సురేష్‌కుమార్, విఆర్‌ఒ వెంకటేశ్వర్లు, నరేంద్ర పాల్గొన్నారు.


ఓటరు నమోదు పత్రాన్ని అందిస్తున్న తహశీల్దార్ దైవాదీనం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఇంటింటా సంక్షేమ లబ్ధి : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో ఇంటింటా సంక్షేమ ఫలాలు జాతర సాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుద్దమల పంచాయతీ ఓబుల్ రెడ్డిగారిపల్లి దిగువ దళితవాడు, తొట్టివాండ్లపల్లి, ఎర్రమరెడ్డి గారిపల్లి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో సకల జనుల సంక్షేమం జరుగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. స్వగ్రామమైన సుద్దమల్లలో ఎంఎల్‌ఎకు జనం నీరాజనాలు పలికారు కార్యక్రమంలో మాజీ ఎంపిపి జనార్ధన రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకట రమణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్ణపు విశ్వనాథ రెడ్డి, సర్పంచుల సంఘ మండల అధ్యక్షుడు నాగభూషన్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, వైస్ ఎంపిపి రవిశంకర్ రెడ్డి, బాబు, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మహేశ్వర రెడ్డి, యోగాంజులు రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, గడికోట చెన్నారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, చింతల జనార్ధన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, నాగబసిరెడ్డి, రాజారెడ్డి, శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, స్టోన్ క్రషర్ గడికోట చంద్రశేఖర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, హస్తకళల డైరెక్టర్ హుసేనయ్య, బిఎస్ వెంకట సుబ్బన్న శివ. శంకర్ మాజీ సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-పీలేరు

చిన్న పిల్లలకు సోకే ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనలో వ్యాధినిరోదక టీకాలు ఉత్తమ ఫలితాలు ఇస్తున్నాయని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శనివారం పిహెచ్‌సి తలుపుల పరిధిలోని గాండ్లపల్లిలో తట్టు టీకాల ఆవశ్యకత గురించి తల్లులకు తెలియజేశారు. తట్టు టీకా పిల్లలకు వేయించని కారణంగా కొన్ని ప్రాంతాల్లో వ్యాధి తీవ్రరూపం దాల్చిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. పిల్లలకు ఉచితంగా వేసే తట్టు టీకాను పిల్లలు పుట్టిన 9, 15 నెలల వయస్సులో తప్పక ఇప్పించాలని తెలిపారు. తట్టు ఎక్కువగా ఐదు సంవత్సరాలలోపు వయస్సులోపు పిల్లలకు సోకే పురాతన, ప్రాణాంతక వైరస్ కారక వ్యాధి అని, వాంతులు, విరేచనాలు, న్యుమోనియా, మెదడుకు ఇన్ఫెక్షన్ సోకి ప్రాణాంతకం కావచ్చని, తేలికపాటి జ్వరం, జలుబు, దగ్గు, తుమ్ములు, ముక్కు కారడం, చర్మంపై దద్దుర్లు ఇవి తట్టు లక్ష్యణాలని అన్నారు. దీనికి విశ్రాంతి, ద్రవాహారాలిస్తూ జ్వరాన్ని అదుపులో ఉంచుకొంటూ. దగ్గర్లోని ప్రభుత్వ వైద్యాధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, వెంకటసుబ్బమ్మ, కుసుమకుమారి, రేణుక, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నపిల్లల తల్లులకు తట్టు గురించి వివరిస్తున్న వైద్యులు


జగనన్న లేఅవుట్‌ను సందర్శిస్తున్న ఎంపిడిఒ లీలా మాధవి

గృహ నిర్మాణాలను పర్యవేక్షించండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని జగనన్న లేఅవుట్‌లలో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణ పనులను అధికారులు, ఇంజనీరింగ్ సహాయకులు ప్రతిరోజు పర్యవేక్షించాలని ఎంపిడిఒ లీలా మాధవి అన్నారు. శనివారం హౌసింగ్‌డే సందర్భంగా మండలంలోని తవళం, బండ్లపై గ్రామాలలోని జగనన్న లేఅవుట్‌లను మండల అధికారులు, హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ సహాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తవళం లేఅవుట్‌లో పక్కా గృహ నిర్మాణ పనులు మందకొడిగా జరుగుతున్నాయని అన్నారు. ఇక్కడ నిర్మాణాలను చేపట్టాలంటే ఇసుక కొరతగా ఉందని, తమకు ఇసుకను అందుబాటులోకి తేవాలని లబ్ధిదారులు ఎంపిడిఒను కోరారు. స్థానిక తహశీల్దార్‌తో చర్చించి జగనన్న లేఅవుట్ల లోని గృహ నిర్మాణ పనులకు ఇసుకను అందుబాటులోకి తెస్తామన్నారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో బిల్లులు నమోదు చేయకపోవడం, లబ్ధిదారులకు సిమెంటు, కమ్మీ, ఇసుక అందించడంలో సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పదేపదే తమ దృష్టికి వస్తోందని, నిర్లక్ష్యాన్ని వీడి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు విధులు నిర్వర్తించాలని తెలిపారు. నిర్లక్ష్యంతో వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, హౌసింగ్ సిబ్బంది రవి, ఇంజనీరింగ్ సహాయకులు భాస్కర, ఆశ, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- రైల్వేకోడూరు రూరల్

వేలూరులో జరిగే రాష్ట్రస్థాయి కుడో పోటీలకు గౌరీశంకర్ స్కూల్ నుండి 7 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ గోపినాథ్ తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు మండల నుండి అనేకమంది పోటీ పడ్డారని అన్నారు. అండర్-14 బాలుర విభాగంలో కే.గంభీర్, టి.హేమంత్, అండర్-14 బాలికలలో కె.కీర్తి, అండర్-17, బాలురులో టి.చరణ్, సతీష్, దొరబాబు, కె.సుదర్శన్ విభాగంలో కోచ్ శివాజీ ఆధ్వర్యంలో గోల్డ్ మెడల్స్ సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రధాన ఉపాధ్యాయులు మాధవి, డైరెక్టర్ పుష్పలత అభినందించారు.

రేపు తంబళ్లపల్లి మండల సమావేశం

తంబళ్లపల్లి: తంబళ్లపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఆనంద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపడిఇఒ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎంపిపి అనసూయమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, గ్రామాలలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులు, పురోగతి తదితర అంశాలపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఎంపిటిసిలు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, జెడ్‌పిటిసి సభ్యులు, అన్ని శాఖల మండల డివిజన్‌స్థాయి అధికారులు, ప్రగతి నివేదికతో సకాలంలో హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె, నందలూరు గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ బూతులను పరిశీలించినట్లు డిప్యూటీ తాసిల్దార్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ నందలూరు పంచాయతీలోని 90, 91, 92, 93, పోలింగ్ కేంద్రాలు నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 94 నుండి 104 మొత్తం 11 పోలింగ్ కేంద్రాలు పరిశీలించా మనీ తెలిపారు. 6 ,7,8 అప్లికేషన్ల ద్వారా చేర్పులు, తొలగింపులు, మార్పుల దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నూతన ఓటర్ల జాబితాను త్వరలో విడుదల చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చంద్రశేఖర్ రాజు, మహిళా పోలీసు సంయుక్త, వీఆర్‌ఏ దేవి ఆయా పోలింగ్ కేంద్రాల బూత్ లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో జీవించాలి

ప్రజాశక్తి - రాయచోటి

విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో జీవించాలని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ప్రత్యేక ఉపాధ్యాయిని రాఫురి సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని చెప్పారు. వారి పట్ల చిన్నచూపు చూపరాదన్నారు.అనంతరం ఆటల పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డయ్య రెడ్డి, ఓబుల్ రెడ్డి, రామయ్య, నబీ రసూల్, ఉమాదేవి పాల్గొన్నారు. స్థానిక మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకుమార్ రెడ్డి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు శేట్టెం ఆంజనేయులు, గంగాదేవి, అశ్విని, లతీఫ్, గోపాలకృష్ణ, శివ ఫణిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు :** విభిన్న ప్రతిభావంతులతో ఆత్మస్థైర్యం నింపాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓ. నిర్మల పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీర లోపం ఉన్న వారిని గుర్తించి ఆదుకోవాలని, వారిని హేళన చేయకూడదని పేర్కొన్నారు. మంచి మనసుతో ఇతరులను ఆదరించే అలవాటు ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులకు క్రీడలు, వ్యాయామం, నృత్యాలు చేసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అంధ ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు వై.వి. నారాయణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రామాపురం :** విభిన్న ప్రతిభావంతుల పట్ల ప్రేమ భిమానాలతో మానవతా దృక్పథంతో ఆదుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు ఉన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. సమావేశంలో ఐఆర్‌టి జమాల్ బాషా, ఉపాధ్యాయులు ఉషాదేవమ్మ, మునిరేవల్లి, ఎంఆర్‌సి సిబ్బంది చంద్రశేఖర్, గోవర్ధన్, అంజనమ్మ పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కేంద్రలో శనివారం ఎంఈఒ రాజ గోపాల్ అధ్యక్షతన సహితవిద్య ఉపాధ్యాయులు రామమోహన్ ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సహితవిద్య ఉపాధ్యాయులు ఏ.రామమోహన్, ఎంఆర్‌సి సిబ్బంది సౌజన్య, నరసింహులు, సిఆర్‌పిలు, దివ్యాంగుల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని భవిత కేంద్రంలో ఎంఈఒ బి.త్యాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఉపకరణాలు ఉపకార వేతనాలు, రవాణా బత్యము, ఎస్కార్ట్ అలవెన్సులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని


రాయచోటి : మెమెంటో, ప్రశంసా పత్రాలతో విభిన్న ప్రతిభావంతులు

కోరారు. కార్యక్రమంలో ఎంపిపి అనసూయ, నారాయణ రెడ్డి , సర్పంచ్ నీలావతి , ఎంపిడిఒ ఆనంద్ కుమార్, ఎంపిటిసి కరీముల్లా , స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, భవితకేంద్రం రీసోర్స్ టీచర్ అనూరాధ, సిఆర్‌పి సుధాకర్, ఫిజియోథెరపిస్టు సరళకుమారి,కేర్ గివర్ గంగరత్నమ్మ , దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఈనెల 7న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదనపల్లెలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. **మదనపల్లె అర్బన్ :** అమ్మచెరువుమిట్టలో గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ విజ్ఞాన వేదిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి జి.శ్రీనివాసులురెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు, వెలుగు కన్వీనర్ ఆర్.భార్గవలక్ష్మి , వెలుగు ప్రిన్సిపల్ పి.వీనాకుమారి పాల్గొన్నారు. **నందలూరు :** నాగిరెడ్డి పల్లె పంచాయతీ పరిధి ఇసుక పల్లె లోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గంగిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు ఉపకార వేతనం, రవాణా బత్యము, ఎస్కార్ట్ అలవెన్స్, చిన్న పాటి శస్త్ర చికిత్సలు లాంటివి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు కన్నయ్య, ఐఈఆర్‌పి లు శ్రీదేవి, రంగస్వామి, ఉపాధ్యాయులు చంద్ర, రాజేశ్వరి పాల్గొన్నారు. **రామసముద్రం :** భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు ఉపకార వేతనాలు, రవాణా బత్యము, ఎస్కార్ట్ అలవెన్స్, చిన్నపాటి శస్త్ర చికిత్సలు లాంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ శ్రీదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర ప్రసాద్ ,ఎంఈఒ కార్యాలయ సిబ్బంది, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు. **గుర్రంకొండ:** అంతర్జాతీయ దినోత్సవ సందర్భంగా స్థానిక బజారు వీధిలో ఉన్న దివ్యాంగుల పాఠశాలలో శనివారం జెడ్‌పిటిసి సంధ్యా ముక్తియార్ అలీఖాన్, గుర్రంకొండ పార్టీ ప్రత్యేక ఆహ్వానితులు ఎస్.యోగేంద్ర దివ్యాంగులకు సైకిల్ పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సుడిగాలి పర్యటన


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ సిఎం కిరణ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -గుర్రంకొండ

మాజీ ముఖ్యమంత్రి నల్లారికిరణ్ కుమార్‌రెడ్డి పీలేరు నియోజకవర్గంలో శుక్ర, శనివారాలలో సుడిగాలి పర్యటన చేశారు. పీలేరు లో జరిగిన ఓ కార్యక్రమంలో అన్నదమ్ములు కిరణ్, కిషోర్‌లు ఒకే వేదికపై కలవడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు. తరిగొండ అమలేపల్లి గ్రామాలలో కార్యకర్తలను పలుకరించి కుమారునికి పరిచయం చేశారు. తరిగొండలో బిసి నాయకుడు గౌరీ శ్రీనివాసులు ఇంటిని వైసిపి నాయకులు ధ్వంసం చేసి వారిని గాయపర చడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల మరణించిన అమిలేపల్లి పంచాయతీమాజీ సర్పంచ్ జగన్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి వెంట అతని తనయుడు కూడా రావడం విశేషం. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎజాస్ అహమద్, మాజీ ఎంపిపి, ఎంఎల్ఎన్ మూర్తిరావు, ఎల్లుట్ల మురళి, తరిగొండ రెడ్డి, శ్రీని వాసులు, బాబు రెడ్డి క్రాంతి కుమార్ , మాజీ మార్కెట్ చైర్మన్ నిరం జన్ రెడ్డి, రెడ్డన్న, సీతారామయ్య ,మాజీ సర్పంచ్ రెడ్డప్పరెడ్డి, రమణ, కిరణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎంఎల్ఎ గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బ్రాహ్మణవీధిలో డాక్టర్ మడితాటి నాగిరెడ్డిచే నూతనంగా ఏర్పాటు చేసిన జనతా ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన వసతులతో ఆసుపత్రి ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. పేదలు అధికంగా ఉన్నప్రాంతంలో సేవలు అందించి ప్రజా మన్ననలను పొందాలన్నారు.

విఆర్‌పిఎస్ చలో ఢిల్లీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకి బోయల హక్కు ఎస్టీ రిజర్వేషన్ కోసం చలోఢిల్లీ చేపడుతున్నట్లు వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గువ్వల యోగానందబాబు పేర్కొన్నారు. ప్రభు త్వ తీర్మానం అనంతరం కేంద్రంపై పోరాటానికి కర్నూలు నుంచి న్యూఢిల్లీ వరకు పాదయాత్ర చేపట్టి జంతర మంతర్‌లో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామన్నారు. వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి 15వ ఆవిర్భావ వారోత్సవాలలో భాగంగా శనివారం మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండ్ వాల్మీకి సర్కిల్‌లో శ్రీ మహర్షి వాల్మీకి విగ్రహానికి పాలాభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరికం నుంచీ సుదీర్ఘకాల హక్కు ఎస్టీ రిజర్వేషన్ నాటి బ్రిటీష్ కాలం నుంచీ 1956 వరకు ఎస్సీ, ఎస్టీలు కొనసాగిన వాల్మీకిబోయలపై పెత్తందారుల వ్యవస్థ పుట్టుకొచ్చిందన్నారు. సామంతరాజుల కాలంలో యుద్ధ వీరులుగా, నమ్మకానికి ప్రతీకగా ఉన్న వాల్మీకిబోయలు అడవిబిడ్డలుగా బతికేవారని గుర్తుచేశారు. కార్యక్రమంలో విఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బసప్ప, నాయకులు లక్కిరెడ్డిపల్లె రామాంజులు, రాయచోటికి చెందిన గువ్వల జగదీష్, రంగ, రామయ్య, గువ్వల నాగేంద్ర, గంటా నాగార్జున, రాజేష్, బసినికొండ చలపతి, శివరాజ్, గంగుల్‌రెడ్డి, ధనుంజయ, శ్రీకాంత్, వెంకటేష్, వెంకటస్వామి, జగదీష్, మదనపల్లె నాయకులు లక్ష్మన్న, నాగినేని గోవిందు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి :'జయరాం'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని ఏనుగొండపాళ్యంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టకు నియోజకవర్గ నాయకులు శ్రీరామినేని జయరామ నాయుడుకు గ్రామస్థులు ఆహ్వానించడంతో వారి ఆహ్వానం మేరకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. తన అభిమానంతో విగ్రహ ప్రతిష‘కు ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

ప్రతి ఒక్క రూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవా లని సరస్వతిపల్లె పం చాయతీ కార్యదర్శి సంజీవ్ రెడ్డి అన్నారు. మండలంలోని సర స్వతి పల్లె పంచాయతీ దళితవాడలో శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వాటర్ స్కిన్ పైప్‌లైన్ ఓవర్ హెడ్ ట్యాంక్ గ్రామంలోని డ్రైయినేజీ కాలువలను పరిశీలించారు. అనంతరం ఓవర్ హెడ్ ట్యాంకు దగ్గర ఉన్న బురద గుంట లను గ్రీన్ అంబాసిడర్స్‌తో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. ఆయన వెంట సచివాల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.


ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పీలేరు

ఏపి పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సర్వజన మహాసభ పోస్టర్‌ను ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపి పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఏ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల సమస్యల సాధనకై పోరాడుతున్న ఏకైక యూనియన్ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అని పేర్కొన్నారు. ఈ నెల 11న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగు యూనియన్ సర్వజన మహాసభకు రాష్ట్ర అధ్యక్షులు జి. ఆస్కారావు అధ్యక్షతన జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశానికి వేల సంఖ్యలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు హాజరై తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వం ఇచ్చే సందేశాన్ని స్వీకరించాలని లక్ష్మీనారాయణ తెలియజేశారు. కార్యక్రమంలో ఐయన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఏ.లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఎం.కుసుమ, తాలూకా ప్రెసిడెంట్ మోహన్, అసోసియేట్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు.

చేయూతనందించాలి : జడ్జి

ప్రజాశక్తి-పీలేరు

దివ్యాంగుల పట్ల సింపతీ చూపడం కాదని వారికి తగిన చేయూతనందించి, వారి అభివృద్ధికి తోడ్పడాలని పీలేరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎన్. గాయత్రి తెలిపారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో జరిగిన జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె భవిత కేంద్రం విద్యార్థులతో ముఖాముఖిగా ముచ్చటించారు. ఈ దినోత్సవాన్ని అతి ముఖ్యమైన దినోత్సవంగా జరుపుకోవాలని చెప్పారు. అంగవైకల్యం అనేది మనకు శాపం కాదని, అది దేవుడిచ్చిన వరంగా భావించాలని, అలాంటి వారికి మనం అన్ని విధాలా ఆదుకోవాల అన్నారు. ప్రభుత్వం ద్వారా వారికి అందాల్సినవి సక్రమంగా అందేలా తోడ్పడాలని కోరారు. అంగవైకల్యం శరీరానికి మాత్రమే కానీ అది మన ఆలోచనలకు కాదని వికలాంగులు వారికి హేళన చేయడం మంచి పద్ధతి కాదు అని ఇలాంటి వారి కోసం అనేక లిపి వచ్చాయని వాటిని సద్వినియోగం చేసుకొని తెలిపారు. అందరితో పాటు ప్రత్యేక ప్రతిభావంతులు కూడా ఉన్నత విద్యను అభ్యసించాలని, అలా చదివిన వారు ఎందరో మహానుభావులు ఉన్నారని వారితో పాటు మీరు కూడా అదే స్థాయికి చేరాలని తెలియజేశారు. రాజ్యాంగంలో అనేక మార్పులు తీసుకు వస్తున్నారని వాటిని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలని దివ్యాంగులను వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.సమస్యలను తమదృష్టికి తెస్తే పరిశీలిస్తామని తెలిపారు. న్యాయమూర్తి విద్యార్థులకు పండ్లు, చాక్లెట్లు, బిస్కెట్స్, పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు షౌకత్ అలీ, నిరంజన్, ఇర్ఫాన్, డాక్టర్ పివిఎస్ లక్ష్మి, డాక్టర్ రాయల సుధాకర రాయలు, పారా లీగల్ వాలంటీర్ కె. గట్టప్ప, భవిత స్కూల్ ఉపాధ్యాయులు ధరణీజ, సుబ్రహ్మణ్యం, సిఆర్‌పిలు మురళీధర్ రాజు, అశోక్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీరామ్ పురుషోత్తం

వంద శాతం ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీరామ్ పురుషోత్తం శనివారం బి.కొత్తకోట మోడల్ స్కూల్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పదవతరగతి విద్యార్థులతో ఆంగ్లభాష నైపుణ్యాల గురించి ప్రశ్నిస్తూ విషయాలను తెలుసు కున్నారు. అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని ప్రభుత్వ సదుపాయాలను అన్నింటినీ వినియోగించుకోవాలని సూచించారు. జగనన్న గోరుముద్దలో భాగంగా అందజేయుచున్న మెనూ గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో వారికి బోధన సాగించాలని వంద శాతం ఫలితాలు సాధించుటకు కృషి చేయాలని, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారి రెడ్డి శేఖర్, ప్రిన్సిపల్ శీను నాయక్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సిపిఎస్ రద్దుకు కార్యాచరణ

ప్రజాశక్తి- పుల్లంపేట


మాట్లాడుతున్న రమణమూర్తి

సిపిఎస్ రద్దు కోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సిపిఎస్ జిల్లా కన్వీనర్ సి.వి.రమణ మూర్తి తెలిపారు. యుటిఎఫ్ పుల్లంపేట శాఖ ఆధ్వ ర్యంలో ఎస్‌బివిడి సభ హై స్కూల్‌లోలో శనివారం సిపిఎస్ ,జిపిఎస్‌కు సంబం ధించిన అంశాలపై సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో సిపిఎస్ ఉద్యోగికి వచ్చే పెన్షన్, వృద్ధాప్య పెన్షన్ కంటే తక్కువగా ఉండబోతుందని అన్నారు. సిపిఎస్, జిపిఎస్ వలన ఎటువంటి లాభదాయకమైనటువంటి అంశాలు లేవని తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి చలపతి మాట్లాడుతూ ఇప్పటివరకు ఉన్నటువంటి డిఎ బకాయిలు, సరెండర్ లీవ్స్ , రిటైర్మెంట్ సంబంధించినటువంటి ఆర్థిక అంశాలు అన్ని కూడా పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


ఓటుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ రాము

ప్రజాశక్తి-కలకడ

మండలంలో18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహ శీల్దార్ రాము పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఓటరు నమో దు, ఫామ్-6 ఎలా నమోదు చేయాలనే అంశంపై గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలోఆర్ఐ మస్తాన్ కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్


ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ సిబ్బంది

8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి- వీరబల్లి

సానిపాయ సెక్షన్ వీరబల్లి బీటు పరిధిలోని టూంకులు దగ్గర అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 8 ఎర్రచందనం దుంగలను స్వాదీనం చేసుకున్నట్లు రేంజర్ పీరయ్య తెలిపారు. శనివారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం మేరకు బేస్ క్యాంప్ ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఎర్రచందనం దుంగలను తరలించేందుకు సిద్ధం చేస్తున్న చెన్నూరు నాగార్జున అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.1.10లక్షలు విలువ చేసే 243 కెజీల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ముద్దాయిపై సానిపాయి రేంజ్ 2లో, వీరబల్లి పిఎస్‌లో ఒక కేసు, సుండుపల్లి పిఎస్‌లో ఒక కేసు, నమోదు అయ్యాయని తెలిపారు. తనిఖీల్లో ఎఫ్ ఆర్ఓ పీరయ్య, ఎఫ్.ఎస్. బాబాసా హెబ్, ఎఫ్‌బిఓ అనిల్ కుమార్, లీల శ్రీహరి, సాయి కృష్ణ, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి- చిన్నమండెం


నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మండలంలోని పడమటి కోన గ్రామం వడ్డేపల్లి సమీపంలో శనివారం నాటు సార ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. నాటు సారా విక్రయించే కొందరు సారాను తయారు చేయడానికి ఉపయోగించే నల్లతుమ్మ చెక్క, బెల్లం కలిపిన ద్రావకాన్ని సిద్ధం చేసి ఉంచడంతో గమనించిన కొందరు రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రమేష్ బాబు పోలీస్ సిబ్బందితో ఊటను పరిశీలించి ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లా డుతూ అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే ఎంతటివారైన ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని కస్తూరి రాజుగారిపల్లి గ్రామం దిగువ బత్తిన వాండ్లపల్లి చెందిన షేక్‌సమీర్ (20) అనే యువకుడు శనివారం తెల్లవారు జామున ఫ్యాన్ కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు. దిగువబత్తిన వాండ్లపల్లి చెందిన సమీర్ జెసిబి డ్రైవర్. స్నేహితులతో మద్యం సేవించి మద్యం మత్తులో ఇంటికి వెళ్ళాడని తల్లి మందలించిందని తెలిపారు. మనస్థాపం చెంది మద్యం మత్తులో ఫ్యానుకు ఉరేసుకొని మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసు పత్రులకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.